సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 21 । ఏప్రిల్ । 2025



ఘనంగా ఈస్టర్ వేడుకలు

జిల్లావ్యాప్తంగా ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 9లో



మితిమీరితే మోతే..!

వేసవిలో విద్యుత్ వినియోగం పెరుగుతుండటంతో 200 యూనిట్ల దాటినవారు ఉచిత విద్యుత్‌ను కోల్పోతున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
40° / 27°

వాతావరణం

జిల్లాలో సోమవారం మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం వరకు వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి నిత్యకల్యాణ వేడుక ఆదివారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. వరుస సెలవులు కావడంతో నిత్యకల్యాణ వేడుకలోనూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీ కనకదుర్గమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకోగా అర్చకులు విశేష పూజలు జరిపారు. అనంతరం అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, వేదపండితుడు పద్మనాభశర్మ, అర్చకుడు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

సూపర్‌బజార్(కొత్తగూడెం): భూభారతి చట్టం అమలులో భాగంగా జిల్లావ్యాప్తంగా అవగాహనా సదస్సుల నిర్వహణలో జిల్లా అధికార యంత్రాంగం నిమగ్నమై ఉన్నందున సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి దరఖాస్తులు అందజేయడానికి కలెక్టరేట్‌కు రావొద్దని సూచించారు.

కిన్నెరసానిలో పర్యాటక సందడి



కిన్నెరసానిలో పర్యటిస్తున్న జడ్జి సాయిశ్రీ

పాల్వంచరూరల్: పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రంవరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 562 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖ రూ.30,420 ఆదాయం లభించగా, 180మంది బోటు షికారు చేయగా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.8,060 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. కొత్తగూడెం రెండో అదనపు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.సాయిశ్రీ కుటుంబ సభ్యులతో కిన్నెరసానిని సందర్శించారు. మ్యూజియంలోని జంతువుల బొమ్మలను వీక్షించి బోటు షికారు చేశారు.

యంత్రం.. పాత మంత్రం

వ్యవసాయ యాంత్రీకరణను పునరుద్ధరించిన ప్రభుత్వం

- గత మార్చిలో పథకం విధివిధానాల వెల్లడి
- మళ్లీ పాత తరహా యంత్రాలకే సబ్సిడీల ప్రకటన
- ప్రస్తుత పరిస్థితులకు తగిన కొత్త పరికరాలకు దక్కని చోటు



పాల్వంచ మండలం సోములగూడెంలోని శ్మశాన వాటికలో ఆరబోసిన ధాన్యం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సబ్‌మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్(స్మామ్) పథకంలో చిన్న, సన్నకారు రైతులతో పాటు ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలను అందిస్తోంది. ఇతర రైతులకు ఈ సబ్సిడీ 40 శాతం ఉంటుంది. గరిష్ఠంగా రూ.5 లక్షల విలువైన యంత్రాలను అందించే వీలుంది. గతంలోనూ ఈ పథకం అమల్లో ఉండగా.. తెలంగాణ ప్రభుత్వం 2018లో రైతుబంధు పథకం ప్రవేశపెట్టాక నిలిపివేసింది. దీంతో వ్యవసాయ యాంత్రీకరణలో వేగం తగ్గింది. ప్రస్తుత ప్రభుత్వం ఇటీవల వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని ప్రారంభించింది. కానీ డ్రోన్లు మినహాయిస్తే ప్రస్తుత అవసరాలకు తగ్గ ఆధునిక యంత్రాలకు చోటు కల్పించకపోవడం లోటుగా మారింది.

మారిన అవసరాలు

గడిచిన ఐదారేళ్లుగా తెలంగాణలో వరిసాగు గణనీయంగా పెరిగింది. గతేడాది నుంచి సన్న రకాలు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తుండడంతో ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యం అమ్మేందుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. కానీ ధాన్యం ఆరబెట్టడం సమస్యగా మారింది. సాధారణంగా కోతలు పూర్తయ్యాక ధాన్యంలో తేమ 35 నుంచి 40 శాతం ఉంటుంది. అయితే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మాలంటే తేమ 17శాతమే ఉండాలి. దీంతో ఆరబెట్టేందుకు ఆధునిక యంత్రాలు (ప్యాడీ డ్రయర్స్) అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇప్పటికీ పాత పద్ధతులే అవలంబించాల్సి వస్తోంది.

కొత్త వాటికి చోటివ్వాలి

ప్రస్తుతం వ్యవసాయంలో ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, రోటవేటర్లు, కల్టివేటర్ల వంటి యంత్రాల వినియోగం దాదాపు సంతృప్త స్థాయికి చేరింది. తిరిగి ఇవే యంత్రాలకు సబ్సిడీలు ఇవ్వడం వల్ల అదనపు ప్రయోజనం ఏమీ ఉండదనే అభిప్రాయం రైతులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు వ్యవసాయ ఉత్పత్తుల ఆరబోత, కోత యంత్రాల అవసరం పెరిగింది. మిర్చి, పత్తి కోతల సమయంలో స్థానికంగా కూలీలు పొరుగు రాష్ట్రాల నుంచి రప్పించాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని ఆధునిక యంత్రాలకు సబ్సిడీలు ఇవ్వాలని, అందుకు తగ్గట్టు నిబంధనల్లో మార్పు చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో వరి ధాన్యం ఆరబెట్టే యంత్రాలు రూ.8 లక్షల నుంచి రూ.30 లక్షల విలువైనవి అందుబాటులో ఉన్నాయి. గంట వ్యవధిలో ఒక ఎకరం పొలంలో పండే ధాన్యాన్ని ఆరబెట్టడంతోపాటు తాలు కూడా ఇవి వేరు చేస్తాయి. తద్వారా రోజుల తరబడి ఆరబోయాల్సిన ఇక్కట్లు తప్పుతాయి. అదే విధంగా మిర్చి, పత్తి కోత మిషన్ల అవసరం ఉన్నందున రైతులకు అందుబాటులో ఉంచాల్సిన అవసరముంది.



బూర్గంపాడు మార్కెట్ యార్డులో ధాన్యం నేరుపుతున్న రైతులు

ఆఖరికి శ్మశానంలోనూ

ధాన్యంలో తేమ శాతం తగ్గించేందుకు గ్రామాల్లో ఖాళీ స్థలాలు, రోడ్ల వెంట, పాఠశాలలు, మైదానాలు, కొనుగోలు కేంద్రాల దగ్గర రైతులు ఆరబెడుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఎక్కడా చోటు లభించక వైకుంఠ ధామా(శ్మశాన వాటిక)ల్లోనూ ధాన్యం ఆరబోసుకోవాల్సి వస్తోంది. ఈ కారణంగా పగలూరాత్రి, ఎండావానా తేడా లేకుండా కాపలా ఉంటున్నారు. పగటి వేళ కూలీలను పెట్టుకుని అరగంటకోసారి ధాన్యాన్ని నేరుపుతూ తేమ తగ్గించేందుకు వ్యయప్రయాసలకు లోనవుతున్నారు. కనీసం వారం పాటు జరిగే ఈ తంతు కారణంగా అయ్యే ఖర్చు, ప్రభుత్వం అందించే బోనస్‌కు సరిపోతోంది. దీంతో చాలామంది సన్నకారు, చిన్నకారు రైతులు మద్దతు ధర రాకున్నా పొలాల వద్ద ప్రైవేట్ వ్యాపారులకు పచ్చి ధాన్యమే అమ్ముకుంటున్నారు. ఫలితంగా బోనస్ చాలా మంది సన్నకారు, చిన్నకారు రైతులకు అందడం లేదు.

నేడు భద్రాచలంలో గిరిజన దర్బార్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే గిరిజన దర్బార్‌లో ఆదివాసీ గిరిజనులు తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదులు అందజేయాలని పేర్కొన్నారు.

'భూభారతి'తో రైతులకు మేలు



ఇల్లెందు రూరల్: మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్, వేదికపై ఎమ్మెల్యే కోరం తదితరులు



టేకులపల్లి: కలెక్టర్‌కు భూ సమస్యలపై దరఖాస్తులు అందజేస్తున్న రైతులు

- వివాదాలకు ఇక శాశ్వత పరిష్కారం
- పేద రైతులకు ఉచిత న్యాయసహాయం
- అవగాహన సదస్సులో కలెక్టర్ జితేష్

ఇల్లెందురూరల్/టేకులపల్లి: భూభారతి చట్టం భూవివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతూ రైతులకు మేలు చేస్తుందని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెం గ్రామ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో, టేకులపల్లి తహసీల్‌లో ఆదివారం భూభారతి చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. బేతంపూడి సొసైటీ ఆధ్వర్యంలో టేకులపల్లి వ్యవసాయ మార్కెట్ సబ్‌యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ సమస్యలు ఉన్న రైతులు ఏడాదిలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, సాదాబైనామా సమస్యలు నిర్దిష్ట గడువులోగా పరిష్కారమవుతాయని తెలిపారు. అన్యాయం జరిగినట్లు భావిస్తే బాధితులు ఆర్డీఓ, కలెక్టర్‌కు అప్పీలు చేసుకోవచ్చన్నారు. ఆర్థికస్తోమత లేని రైతులకు ఉచితంగా న్యాయ సహాయం కూడా అందుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా లక్షల సంఖ్యలో పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. గతంలో ధరణి పోర్టల్‌ను ప్రైవేటు సంస్థ నిర్వహించడం వల్ల అనేక తప్పిదాలకు అవకాశం ఏర్పడిందని, కానీ భూభారతి పోర్టల్‌ను ప్రభుత్వమే నిర్వహిస్తుందని, తప్పిదాలకు అవకాశం ఉండదని అన్నారు. రైతులు ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర, బోనస్ పొందాలని సూచించారు. అనంతరం పలువురు రైతుల సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. పలువురి నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కొత్త సొసైటీలకు స్థలాలు కేటాయించాలని కలెక్టర్‌కు చైర్మన్ విన్నవించారు.

ధరణితో చాలా నష్టపోయారు..

తప్పుల తడకగా ఉన్న ధరణితో పోర్టల్‌తో రైతులు చాలా నష్టపోయారని, భూభారతి చట్టం సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను, రికార్డులను అస్తవ్యస్తం చేసిందని విమర్శించారు. కాస్తుదారు కాలమ్ తొలగించడంతో అనేక మంది రైతులకు అన్యాయం జరిగిందన్నారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో టెంట్లు, తాగునీరు ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ సిబ్బంది వైద్య శిబిరం నెలకొల్పారు. కాగా ఇల్లెందులో ఆదివాసీ చట్టాలకు సంబంధించి ఓ న్యాయవాది సంధించిన ప్రశ్నలు చర్చనీయాంశంగా మారాయి. ఇదే విషయమై సదస్సు అనంతరం ఘర్షణకు దారి తీయడంతో సమావేశ ప్రాంగణంలో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను శాంతింపచేశారు. ఆర్డీఓ మధు, ఏడీఏ లాల్‌చంద్, తహసీల్దార్లు రవికుమార్, నాగభవాని, ఎంపీడీవోలు ధన్‌సింగ్, రవీంద్రరావు, ఏఓలు సతీష్, అన్నపూర్ణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటరాజశేఖర్‌రెడ్డి, సొసైటీ సీఈఓ పి.ప్రేమాచారి, నాయకులు భూక్య దళ్‌సింగ్‌నాయక్, చరణ్, పీఏసీఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, కోరం సురేందర్, కె.వెంకట్, శివలాల్, బి.బాలాజీ, శ్యాం, ఉదయ్ పాల్గొన్నారు.

ఆ ఊరికి రామయ్యస్వామే రుణదాత

- ఏడాదిలోగా వడ్డీతో సహా అప్పు చెల్లిస్తున్న గ్రామస్తులు
- అశ్వాపురం ఎస్సీ కాలనీలో 20 ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయం



ఎస్సీ కాలనీలో సీతారామచంద్రస్వామి మండపం

అశ్వాపురం: సాధారణంగా ఏదైనా అవసరం వస్తే ఇతరుల వద్ద అప్పు తీసుకుంటారు. కానీ ఆ గ్రామంలో ప్రతీ ఒక్కరు దేవుడి వద్దే అప్పు తీసుకుంటున్నారు. తిరిగి ఏడాదిలోగా వడ్డీతో సహా చెల్లిస్తున్నారు. మండల కేంద్రానికి సమీపంలో ఉన్న ఎస్సీ కాలనీలో 20 ఏళ్లుగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. 2004లో శ్రీసీతారామ చంద్రస్వామివారి ఆలయంలో హోమం, యాగాలు నిర్వహించాక గ్రామస్తులు సేకరించిన నగదులో రూ. 15 వేలు మిగిలాయి. ఆలయ అభివృద్ధికి మరో రెండు సంస్థలు రూ.25 వేల చొప్పున రూ. 50 వేలు విరాళం ఇచ్చాయి. మొత్తం రూ. 65 వేలు కాగా, ఆ నగదును ఎక్కడా ఖర్చు చేయకుండా గ్రామస్తులకు రుణం ఇవ్వాలని ఆలయ కమిటీ నిర్ణయించింది. ఒక్కరికి రూ.6 వేల వరకు రుణం ఇవ్వాలని, తీసుకున్న అప్పు ఏడాదిలోపు చెల్లించాలని, రుణానికి ఆ గ్రామంలోనివారే అర్హులని నిబంధనలు పెట్టుకున్నారు. అప్పటి నుంచి గ్రామస్తులు అప్పు తీసుకుంటూ, తిరిగి చెల్లిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం స్వామివారికి గ్రామస్తులు రూ.20.90 లక్షల వరకు అప్పు ఉన్నారని ఆలయ కమిటీ వారు చెబుతున్నారు. సీతారామచంద్రస్వామి వద్ద అప్పు తీసుకుని ప్రారంభిస్తే అనుకున్న పనులు దిగ్విజయంగా పూర్తవుతాయని గ్రామస్తులు విశ్వసిస్తున్నారు. కాగా గ్రామంలో రామాలయం నిర్మించాలనుకున్న స్థలంలో ఏటా పందిరి మండపం ఏర్పాటు చేసి కల్యాణం నిర్వహిస్తున్నారు.

నిర్లక్ష్యం నీడన నిరసనల వేదిక

- పడావుగా మారుతున్న ధర్నాచౌక్ స్థలం
- కలెకర్టేట్ ఎదుటే కొనసాగుతున్న ఆందోళనలు
- చదును చేసి ఫెన్సింగ్ వేయాలని విన్నపాలు



కలెక్టరేట్ వద్ద ఉన్న ధర్నాచౌక్

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యల పరిష్కారం కోసం వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు తెలిపే కలెక్టరేట్ ధర్నాచౌక్ నిర్లక్ష్యానికి గురవుతోంది. జిల్లాల పునర్విభజన తర్వాత చాలా ఆలస్యంగా కలెక్టరేట్ సమీపంలో ధర్నాచౌక్‌కు స్థలాన్ని కేటాయించారు. కానీ ఆ స్థలాన్ని చదును చేసి కనీస సౌకర్యాలు కల్పించలేదు. ధర్నా చౌక్ ఏర్పాటు తర్వాత వివిధ సమస్యలపై ప్రజా సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో ఇబ్బడిముబ్బడిగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఆ సమయంలో ధర్నా స్థలం కొంత శుభ్రంగా ఉండేది. ఎన్నికల కోడ్‌లు వచ్చిన సందర్భంగా ధర్నాలకు, ఆందోళనలకు బ్రేక్ పడింది. కోడ్ ముగిశాక మళ్లీ ఆందోళనా కార్యక్రమాలు జరుగుతున్నాయి. కానీ ధర్నాచౌక్ స్థలం అనుకూలంగా లేకపోవడంతో కలెక్టరేట్ ఎదుటే నిరసన తెలుపుతున్నారు. మరికొందరు కలెక్టరేట్ ఎదుట గేట్ ముందు కాకుండా ఏకంగా కలెక్టరేట్ ఆవరణలోనే ధర్నాలు నిర్వహిస్తున్నారు. ఇక ధర్నాచౌక్‌ను ఎవరూ పట్టించుకోకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగి పడావుగా మారుతోంది. ధర్నాలు, నిరసన కార్యక్రమాలు జరిగే సమయంలో జనసమీకరణ ఎక్కువగా ఉంటుంది. కలెక్టరేట్ ఎదుటే జాతీయ ప్రధాన రహదారి ఉండటంతో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇలాంటి సమయంలో ఏదైనా వాహనం అదుపుతప్పి జాతీయ రహదారి పక్కనే నిరసన చేపడుతున్న ఆందోళకారులపైకి దూసుకు వెళ్తే జరిగే ప్రాణనష్టం ఊహించుకోవడానికే కష్టంగా ఉంటుంది. ఇప్పటికైనా ధర్నాచౌక్ స్థలం చదును చేసి ఫెన్సింగ్ వేయాలని, తాగునీరు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని, నిత్యం పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

పరిష్కార వేదికే సమస్య కావొద్దు



సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ఆందోళన కార్యక్రమాలకు వేదిక ధర్నాచౌక్. అలాంటి ప్రాంతమే సమస్యగా మారొద్దు. జిల్లా యంత్రాంగం స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాలి.

– ఎస్‌కె సాబీర్‌పాషా, సీపీఐ జిల్లా కార్యదర్శి

నిర్లక్ష్యం సరికాదు



రాష్ట్రంలోనే అతిపెద్ద జిల్లా మనది. ఉద్యమాలకు పెట్టింది పేరు. అలాంటి జిల్లాలో ధర్నా చౌక్ నిర్లక్ష్యానికి గురవుతోంది. ఉద్యమాలకు అనుకూలంగా తీర్చిదిద్దాలి. తాగునీటి సౌకర్యం కల్పించాలి. వేదికను ఏర్పాటు చేయాలి.

–మచ్చా వెంకటేశ్వర్లు, సీపీఎం జిల్లా కార్యదర్శి

బాధితులకు భరోసా..

- వడదెబ్బ మృతుల కుటుంబాలకు పరిహారం రూ. 4 లక్షలకు పెంపు
- త్రిసభ్య కమిటీ, కలెక్టర్ నివేదిక ఆధారంగా చెల్లింపులు
- వడగాల్పులను రాష్ట్ర ప్రత్యేక విపత్తుగా గుర్తింపు



మండుటెండలో మిర్చి కోస్తున్న కూలీలు

బూర్గంపాడు/మంచుపల్లి: వడగాడ్పులను రాష్ట్ర ప్రత్యేక విపత్తుగా ప్రభుత్వం పరిగణించింది. వడదెబ్బతో మృత్యువాత పడిన కుటుంబాలకు అండగా నిలవనుంది. బాధిత కుటుంబాలకు అందించే పరిహారం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి ఇటీవల రాష్ట్ర విపత్తుల నివారణ విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు వడదెబ్బ మృతుల కుటుంబాలకు ఆపద్బంధు పథకం కింద రూ. 50 వేల పరిహారం చెల్లిస్తుండగా, ప్రభుత్వం ఆ మొత్తాన్ని రూ.4 లక్షలకు పెంచింది. మండలస్థాయి కమిటీ చేసే సిఫార్సును కలెక్టర్ పరిశీలించి ఆమోదించాక పరిహారం అందనుంది.

సకాలంలో చికిత్స అందక పలువురు మృతి

వేసవిలో ఎండల తీవ్రతకు ఏటా పలుచోట్ల వృద్ధులు, వ్యవసాయ కూలీలు, రైతులు, ఉపాధి హామీ కూలీలు, హమాలీలు, ఇతర కార్మికులు వడదెబ్బకు గురవుతున్నారు. సకాలంలో చికిత్స అందక పలువురు మృత్యువాత పడుతున్నారు. వీరికి గతంలో ప్రభుత్వం ఆపద్బంధు పథకం కింద రూ. 50 వేల ఆర్థికసాయమందించేది. వరుస వారీగా దరఖాస్తులను పరిశీలించి, అర్హుల జాబితాను కలెక్టర్‌కు పంపితే, అక్కడ కూడా వరుస వారీగా నిధుల లభ్యతను బట్టి సాయమందించేవారు. ఆపద్బంధు పథకానికి ప్రమాదవశాత్తు మరణించిన వారు, వివిధ కారణాలతో మృతిచెందిన వారు కూడా దరఖాస్తు చేసుకునేవారు. ఏడేనిమిదేళ్లుగా ఆపద్బంధు పథకం దాదాపుగా నిలిచిందనే చెప్పాలి. సాయం అందకపోవటం, పరిహారం కూడా తక్కువ మొత్తంలో ఉండటం, పోస్టుమార్టం వ్యయప్రయాసలను దృష్టిలో పెట్టుకుని ఎక్కువ మంది దరఖాస్తు చేసుకోవడానికి ఆసక్తి కూడా చూపడంలేదు. ప్రస్తుతం పరిహారం పెంచిన నేపథ్యంలో బాధితుల కుటుంబీకులు పేర్ల నమోదుకు ముందుకొచ్చే అవకాశం ఉంది.

ఇటీవలి వడదెబ్బ మృతులు..

- ఇల్లెందు మండలం లక్ష్మీనారాయణ తండాకు చెందిన మేకల కాపరి బానోత్ హేమ్లా (55) గత సోమవారం వడదెబ్బతో మృతి చెందాడు.
- టేకులపల్లి మండలం మద్రాసు తండా కొండంగులబోడుకు చెందిన కేళోత్ గోబ్రియా (49) గత నెల 24న చేలో వడదెబ్బకు గురై మృత్యువాత పడ్డాడు.
- పినపాక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తాటి రత్తాలు (55) గత నెల 15న బంధువుల పెళ్లి పత్రికలు పంచేందుకు వెళ్లి వడదెబ్బ బారినపడి మృతి చెందింది.

ఉష్ణోగ్రత 45 డిగ్రీలు దాటితేనే..

రూ.4 లక్షల పరిహారమందించటం బాధిత కుటుంబాలకు ఒకింత ఊరటనిస్తుంది. ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటి వడగాలులు వీస్తున్న రోజులనే ప్రత్యేక విపత్తుగా పరిగణనలో తీసుకుంటారు. వడదెబ్బతో అస్వస్థత గురై ఎవరైనా మరణిస్తే తహసీల్దార్, మండల వైద్యాధికారి, పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్‌లతో కూడిన మండలస్థాయి త్రిసభ్య కమిటీ క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదికలను సిద్ధం చేయాలి. మృతుని కుటుంబ సభ్యులు ముందుగా ఈ కమిటీకి సమాచారం ఇవ్వాలి. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి పోలీస్‌శాఖ అనుమతితో మండల వైద్యాధికారి ఆధ్వర్యంలో తహసీల్దార్ సమక్షంలో శవపరీక్ష నిర్వహించాలి. శవ పంచనామా నివేదికల అనంతరం డెత్ సర్టిఫికెట్, నామినీ వివరాలను మండల కమిటీకి అందించాలి. పూర్తిస్థాయిలో విచారణ చేసి మండలస్థాయి కమిటీ సిద్ధం చేసిన నివేదికలను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి పరిశీలించి కలెక్టర్‌కు సమర్పించాలి. ఆ నివేదికను కలెక్టర్ పరిశీలించి, ప్రభుత్వానికి పంపితే పరిహారం అందుతుంది.

అవగాహన కల్పిస్తున్నాం



పరిహారం పెంచడం వల్ల వడదెబ్బ మృతుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కలుగుతుంది. జిల్లాలో వేసవి రక్షణ చర్యలు చేపట్టాం. కొన్ని మేజర్ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో చలి వేంద్రాలు ఏర్పాటు చేశాం. ఇంకా పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెస్తాం. ఉపాధి కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నాం. వైద్యశాఖను అప్రమత్తం చేసి అవగాహన చర్యలు చేపడతాం.

– డి.వేణుగోపాల్, అదనపు కలెక్టర్

రజతోత్సవ సభకు తరలిరావాలి

ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్ నేతల సమావేశంలో ఎమ్మెల్సీ తాతా , వద్దిరాజు, పువ్వాడ



సమావేశమైన బీఆర్‌ఎస్ ఉమ్మడి జిల్లా నేతలు

ఖమ్మంమయూరిసెంటర్ : తెలంగాణ ప్రజల గుండె ధైర్యం గులాబీ జెండా అని చాటి చెప్పేందుకు ఈ నెల 27న హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మం బీఆర్‌ఎస్ కార్యాలయంలో పార్టీ ఉమ్మడి జిల్లా నేతల సమావేశం నిర్వహించారు. పార్టీ రజతోత్సవ సభల జయప్రదానికి ఉమ్మడి జిల్లా నుంచి బీఆర్‌ఎస్ శ్రేణుల తరలింపుపై దిశా నిర్దేశం చేశారు. సభకు వచ్చే వారికి అవసరమైన ఏర్పాట్లు, తాగునీరు, భోజనాల సరఫరాతో పాటు నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జ్‌ల నియామకం తదితర అంశాలపై చర్చించారు. రజతోత్సవ వేడుకల్లో భాగంగా ఈనెల 27న ఉదయం ఉమ్మడి జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో పార్టీ జెండాలు ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లోని పార్టీ దిమ్మెలను ముస్తాబు చేయాలని, లేని చోట నిర్మించాలని సూచించారు. ఉమ్మడి జిల్లా నుంచి నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఎల్కతుర్తి సభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాల ఉపేందర్‌రెడ్డి, కొండబాల కోటేశ్వరరావు, వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, బానోత్ హరిప్రియ, బానోత్ మదన్‌లాల్, బానోత్ చంద్రావతి, జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణ, దిండిగాల రాజేందర్, ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, ముత్యాల వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విజేతగా భద్రాద్రి గాయకుడు



బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

భద్రాచలంటౌన్: ఖమ్మం జిల్లా ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో ఎస్ఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యాన జిల్లాస్థాయిలో నిర్వహించిన సినీ హంగామా సమ్మర్ స్పెషల్ సినీ ట్రాక్ సింగింగ్ పోటీల్లో భద్రాద్రి గాయకుడు పోకల శ్రీనివాస్ విజేతగా నిలిచాడు. ఈపోటీల్లో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 75 మంది గాయనీ గాయకులు పాల్గొనగా.. శ్రీనివాస్ విజేతగా గెలిచి రూ.5వేల ప్రోత్సాహక బహుమతి అందుకున్నాడు. న్యాయ నిర్ణేతలుగా రాజాబాబు, సరళ వ్యవహరించారు.

బైక్‌లను ఢీకొన్న లారీ..

● ఒకరి మృతి



హరికిరణ్ మృతదేహం

నేలకొండపల్లి: బైక్‌ను ఢీకొట్టిన లారీ.. తప్పించుకునే క్రమంలో మరో బైక్‌ను ఢీకొట్టడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరు మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని బోదులబండ అండర్‌పాస్ వద్ద రాజస్థాన్‌కు చెందిన, క్వారీలో పని చేసే కూలీల బైక్‌ను లారీ ఢీకొట్టింది. అక్కడి నుంచి తప్పించుకునే క్రమంలో లారీని వేగంగా నడుపుతూ డ్రైవర్.. కొద్దిదూరంలో మరో బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో మొదటి బైక్‌పై వస్తున్న రాజస్తాన్ కూలీల్లో హరికిరణ్ (36) మృతిచెందాడు. అదే ప్రమాదంలో రాజ్‌బహదూర్, రాంజీలాల్, మరో బైక్‌పై వస్తున్న తిరుమలాపురం గ్రామానికి చెందిన భూక్యా వెంకటసాయి తీవ్రంగా గాయపడ్డారు. లారీడ్రైవర్ మద్యం సేవించి ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. లారీడ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

చెన్నారంలో చోరీలు..

నేలకొండపల్లి: మండలంలోని చెన్నారంలో రెండు ఇళ్లలో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని చెన్నారంలో మూడు రోజుల కిందట కందగట్ల కృష్ణ, బోయినపల్లి వేణు నివాసాల్లో చోరీ జరిగింది. తలుపులు పగలగొట్టి.. బీరువాలో ఉన్న నగదును చోరీ చేశారు. రెండిళ్లలో కలిపి రూ.6 వేల వరకు నగదు చోరీకి గురవగా.. ఆదివారం బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తల్లిదండ్రులు మందలించారని యువకుడు ఆత్మహత్య



రాజు (ఫైల్)

నేలకొండపల్లి: ఖరీదైన మొబైల్ కొన్నందుకు తల్లిదండ్రులు మందలించారని.. ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని శంకరగిరితండాకు చెందిన ధరావత్ రాజు (24) రెండు రోజుల కిందట ఖరీదైన మొబైల్ కొనుగోలు చేశాడు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల దృష్ట్యా అంత ఖరీదు పెట్టి ఎందుకు కొనుగోలు చేశావని.. పైగా ఏపని చేయటం లేదని.. తల్లిదండ్రులు మందలించారు. మనస్తాపం చెందిన రాజు పురుగులమందు తాగగా కుటుంబసభ్యులు ఖమ్మం వైద్యశాలకు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడు అదృశ్యం



బక్కయ్య

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన 64 ఏళ్ల తుడుం బక్కయ్య కనిపించకుండా పోయిన ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. గత నెల 20వ తేదీన కటింగ్ చేయించుకుంటానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన బక్కయ్య తిరిగి రాలేదు. బక్కయ్య కుమారుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

బైక్ దొంగను పట్టుకున్న స్థానికులు



పట్టుబడిన దొంగ

అశ్వారావుపేట: అశ్వారావుపేటలో బైక్‌ను దొంగిలించేందుకు యత్నించిన ఓ వ్యక్తిని ఆదివారం స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. స్థానిక తూర్పు బజారు వాసి కొడమంచిలి రాజు ఇంటి ముందు నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాన్ని ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం రౌతుగూడెం గ్రామానికి చెందిన బల్లెం నాగేశ్వరరావు దొంగిలించే ప్రయత్నించాడు. గమనించి పట్టుకున్న స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ప్రాథమిక విచారణలోనే నాగేశ్వరరావుపై ఏపీలో దొంగతనం కేసులున్నట్లు గుర్తించామని, విచారించి కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ యయాతి రాజు తెలిపారు.

మితిమీరితే మోతే..!



భద్రాచలంలో జీరో బిల్‌ను అందజేస్తున్న ఏడీఈ వేణు, ఉద్యోగులు (ఫైల్)

వేసవిలో పెరగనున్న విద్యుత్ వినియోగం

- 200 యూనిట్లు దాటితే జీరో బిల్లుకు దూరం
- జిల్లా వ్యాప్తంగా 1,64,080 మందికి పథకం వర్తింపు
- లబ్ధిదారులూ బహుపరాక్

భద్రాచలంఅర్బన్: ఎండలు మండుతున్న నేపథ్యాన ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండతాపం నుంచి ఉపశమనం పొందేందుకు ఏసీలు, ఫ్యాన్లు, కూలర్లను అధికంగా వాడుతుండడంతో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకం కింద వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తుండగా.. జీరో బిల్ కోసం పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచించారు. కాగా, వేసవి దృష్ట్యా 200 యూనిట్లు దాటితే బిల్లు మరింత అదనపు భారం కానుందని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

4,57,216 కనెక్షన్లు.. రూ.13.69 కోట్ల బిల్లులు

జిల్లా వ్యాప్తంగా 4,57,216 కనెక్షన్లు ఉండగా.. ప్రభుత్వం నెలకు సుమారు రూ.5.12 కోట్లు, అదే ఏడాదికి సుమారు రూ.67.88 కోట్ల బిల్లులు చెల్లిస్తోంది. వీటిలో వ్యవసాయం, కంపెనీలు, గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాల బిల్లులు వస్తున్నప్పటికీ గృహజ్యోతి బిల్లులు ప్రభుత్వం చెల్లిస్తోంది.

1,64,080 మందికి లబ్ధి..

జిల్లా వ్యాప్తంగా గృహ విద్యుత్ వినియోగదారులు 1,68,003 ఉండగా.. ప్రభుత్వం జీరో బిల్ అమలు చేసిన నాటి నుంచి 1,64,080 మందికి లబ్ధి చేకూరుతోంది. ఇప్పటికే ఎండలు దంచికొడుతుండగా.. రానున్న రెండు నెలల్లో విద్యుత్ వినియోగం పెరగడం ఖాయం కాగా కొందరికే జీరో బిల్ వచ్చే పరిస్థితులు కనబడుతున్నాయి. విద్యుత్‌ను పొదుపుగా వాడుకుంటే తప్పా.. 200 యూనిట్లు దాటిన వారంతా విద్యుత్ బిల్లు చెల్లించాల్సిందేనని అధికారులు తేల్చి చెబుతున్నారు.

3,923 మంది పథకానికి దూరం..

జిల్లా వ్యాప్తంగా 1,64,080 మంది పథకానికి అర్హులు కాగా గడిచిన ఫిబ్రవరికి సంబంధించిన విద్యుత్‌ను మార్చిలో మీటరు రీడింగ్ తీయగా.. 3,923 మంది గృహజ్యోతి పథకానికి దూరమయ్యారు. దీంతో వారు ఫిబ్రవరి బిల్లంతా చెల్లించాల్సి వస్తోంది. రానున్న రెండు నెలల్లో విద్యుత్ వినియోగం మరింత పెరిగే అవకాశాలు లేకపోలేదు. గతేడాది మార్చిలో 4,942 మంది, ఏప్రిల్‌లో 10,119 మంది, మేలో 16,036 మంది లబ్ధిదారులు పథకానికి దూరమై జూన్ తర్వాత నుంచి మళ్లీ పథకం లబ్ధి పొందారు.

ఒక్క యూనిట్ మించినా..

ఉచిత విద్యుత్ 200 యూనిట్లకే పరిమితం. ఒక్క యూనిట్ దాటినా యూనిట్‌కు రూ.5.10 చొప్పున బిల్లు పడుతుంది. 201 యూనిట్లు నమోదైతే ఇతర చార్జీలతో కలిపి కనీస బిల్లు రూ.1,050 చెల్లించాల్సి ఉంటుంది.

బిల్లు భారాన్ని అధిగమించాలంటే..

- అవసరం మేరకే ఫ్యాన్లు, కూలర్లు వాడాలి.
- ఏ గదిలో ఉంటే ఆ గదిలోనే ఫ్యాన్లు, లైట్లు వినియోగించాలి.
- ఉక్కపోత అధికంగా ఉన్నప్పుడే కూలర్లు వాడాలి.
- నాణ్యతలేని కూలర్లు, ఫ్యాన్లతో అధిక విద్యుత్ వినియోగించడానికి ఆస్కారం ఉంది.
- ఉచిత విద్యుత్ అనే భావనతో నిర్లక్ష్యం చేస్తే బిల్లు మోత తప్పదు.
- ఎల్ఈడీ బల్బులు, ట్యూబ్‌లైట్లు వాడాలి.

గత మూడు నెలల్లో జిల్లావ్యాప్తంగా విద్యుత్ వినియోగం

నెల	వినియోగం (మిలియన్ యూనిట్లలో)
ఫిబ్రవరి	151.45
మార్చి	175.03
ఏప్రిల్	59.62

(ఇప్పటి వరకు)

పొదుపుగా వాడుకోవాలి..



వేసవిలో ప్రతీ వినియోగదారుడు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి. ప్రభుత్వం 200 యూనిట్ల వరకే ఉచిత విద్యుత్ అందిస్తుండగా.. అవసరాల మేరకే వాడుకోవాలి. లేదంటే ఒక్కయూనిట్ దాటినా బిల్లు మొత్తం కట్టాల్సిందే. వృథాను అరికట్టి సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి.

– మహేందర్, ఎస్ఈ, విద్యుత్ శాఖ

జీరో బిల్లు అందిస్తున్నాం..



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జీరో బిల్లు అమలు చేస్తోంది. కంపెనీలు, ప్రభుత్వ భవనాలు, వ్యవసాయ బిల్లులు అధికారులు, రైతుల వద్ద వసూళ్లు చేస్తూ ప్రభుత్వానికి చెల్లిస్తున్నాం. విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం.

– జీవన్‌కుమార్, డీఈ, భద్రాచలం



రన్ రాజా.. రన్!

ఖమ్మం పటేల్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్

- రూ.6.65కోట్ల నిధులతో పనులు ప్రారంభం
- మూడు నెలల్లో పూర్తిచేసేలా కార్యాచరణ



సింథటిక్ ట్రాక్ నిర్మాణ పనులు..

ఖమ్మం స్పోర్ట్స్: వేలాది మంది క్రీడాకారులకు ఓనమాలు నేర్పడమే కాక జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే వేదికగా నిలిచిన ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో అథ్లెటిక్స్ క్రీడాకారుల కోసం సింథటిక్ ట్రాక్ అందుబాటులోకి రానుంది. రూ.6.65 కోట్ల వ్యయంతో ట్రాక్ నిర్మాణ పనులు మొదలయ్యాయి. మట్టి ట్రాక్‌లో శిక్షణ పొందుతూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న క్రీడాకారులకు కొత్త ట్రాక్ అందుబాటులోకి వస్తే అత్యుత్తమ క్రీడాకారులు వెలుగులోకి వచ్చే అవకాశముందని చెబుతున్నారు.

ఏళ్ల క్రితమే ప్రతిపాదనలు

ఖమ్మంలో అథ్లెటిక్స్ అకాడమీ ఏర్పాటై రెండు దశాబ్దాలు గడుస్తుండగా.. స్టేడియంలో ఇన్నాళ్లుగా సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి అడుగులు పడలేదు. జిల్లా క్రీడాశాఖ అధికారులు, అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు, కోచ్‌లు చొరవ చూపినా ఫలితం కానరాలేదు. గత ప్రభుత్వ హయాంలో ట్రాక్ మంజూరు చేసినా నిధులు మాత్రం కేటాయించలేదు. అంతేకాక ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడే సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయాలని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ భావించినా నిధుల లేమి వేధించింది. ఇంతలోనే ట్రాక్ ప్రతిపాదిత స్థలాన్ని క్రికెట్ శిక్షణకు కేటాయిస్తారనే ప్రచారం జరిగింది. ఇలా రకరకాల అడ్డంకులతో ట్రాక్ నిర్మాణం ఓ అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అన్న చందంగా మారింది.

పట్టుబట్టడంతో...

గత రెండేళ్లుగా జిల్లా క్రీడల శాఖ, అథ్లెటిక్స్ అసోసియేషన్, కోచ్‌లు సింథటిక్ ట్రాక్ కోసం పట్టుపట్టాయి. స్టేడియంలో మట్టిట్రాక్‌పై శిక్షణ పొందిన అబ్దుల్ నజీబ్‌ఖరేషి, పవన్‌కుమార్, సుధాకర్ తదితరులు అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటారు. మరికొందరు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించారు. ఇక్కడ అకాడమీకి తోడు అనుభవం కలిగిన కోచ్ ఉన్నందున సింథటిక్ ట్రాక్ అందుబాటులోకి క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందుతుందనే భావనతో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. ఇటీవల మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం ఇవ్వగా, ఆయన ట్రాక్ ఏర్పాటుపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మున్సిపల్ శాఖ అధికారులతో చర్చించి నిధులు కేటాయింపునకు సూచనలు ఇచ్చారు. ఈమేరకు ఏళ్లుగా క్రీడాకారులు ఎదురుచూస్తున్న సింథటిక్ ట్రాక్ నిర్మాణ పనులు శనివారం మొదలయ్యాయి. ఈ ట్రాక్‌ను మూడు నెలల్లో అందుబాటులోకి తీసుకరావాలనే లక్ష్యంతో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

సీఎం వచ్చిన రోజే పెళ్లి చేసుకుంటా !

- ఓ కాంగ్రెస్ కార్యకర్త స్పష్టీకరణ
- రేవంత్‌రెడ్డిని రప్పించాలంటూ వైరా ఎమ్మెల్యేకు వినతి



గణేష్ వినతిపై సీఎంను రావాలని కోరుతూ రాసిన ఎమ్మెల్యే (ఇన్ సెట్)

వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న గణేష్

కారేపల్లి: 'సీఎం రేవంత్‌రెడ్డి వచ్చిన రోజే నా పెళ్లికి ముహూర్తం ఖరారు చేస్తా' అంటూ కారేపల్లి మండలం మేకలతండాకు చెందిన ఓ కాంగ్రెస్ కార్యకర్త అంటున్నాడు. మేకలతండాకు చెందిన భూక్యా గణేష్‌కు ఇటీవల పెళ్లి నిశ్చితార్థం అయింది. కాగా, గణేష్‌కు మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ అన్నా, సీఎం రేవంత్‌రెడ్డి అన్నా చాలా ఇష్టం. దీంతో రేవంత్‌రెడ్డి వస్తేనే పెళ్లి చేసుకుంటానంటూ భీష్మించాడు. ఆయనకు కుదిరిన రోజే పెళ్లి తేదీ ఖరారు చేస్తా అంటున్నాడు. ఎలాగైనా సీఎంను రప్పించాలంటూ ఆదివారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌కు వినతిపత్రం అందించాడు. దీంతో అతడి వినతిపై 'రెస్పెక్టెడ్ సీఎం సార్, ప్లీజ్ కైండ్లీ అటెండ్ ది మ్యారేజ్.. వెరీ వెరీ ఇంపార్టెంట్ లీడర్ ఇన్ సింగరేణి మండల్, ప్లీజ్ ఎనీ డేట్ డు ఫిక్స్' అని రాసి సంతకం చేసిన ఎమ్మెల్యే సీఎం ఆఫీస్‌కు పంపించారు. కాగా గణేష్ పెళ్లికి సీఎం వస్తారా.. అప్పటిదాకా అతడు పెళ్లి చేసుకుంటాడా లేదా అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో బీటీపీఎస్ ఏడీకి గాయాలు

అశ్వాపురం: మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామం వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బీటీపీఎస్ ఏడీ ఏవీ.రమణకు గాయాలయ్యాయి. రమణ వారి బంధువులు ఇద్దరితో కలిసి విజయవాడ నుంచి కారులో బీటీపీఎస్‌కు వస్తున్నారు. ఈక్రమంలో అశ్వాపురం మండలం గొల్లగూడెం స్టేజీ వద్ద మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారిపై కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న వంతెనను ఢీకొట్టి బోల్తా పడింది. ఈప్రమాదంలో ఏడీకి గాయాలు కాగా మరో ఇద్దరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. అంబులెన్స్‌లో ఏడీని విజయవాడ తీసుకెళ్లారు.

విద్యార్థి మృతిపై కేసు నమోదు

పాల్వంచరూరల్: ఫోన్‌చూడొద్దని చెప్పినందుకు మనస్థాపంలో ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటనపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని బొల్లారంలో నివాసముంటున్న బందెల రాముకు ఇద్దరు కుమారులు కాగా, చిన్నకుమారుడైన శ్రీరామ్(17) శనివారం కాలనీ శివారులో ఉరివేసుకుని మృతిచెందాడు. ఇతడు పాల్వంచ పట్టణంలోని ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన బంధువు ఇంట్లో ఉంటూ 8వ తరగతి చదువుతున్నాడు. అయితే ఈ నెల 18న ఇంట్లోనే ఫోన్‌లో గేమ్ ఆడుతున్న శ్రీరామ్‌ను అమ్మమ్మ ఫోన్ చూడొద్దు, గేమ్ ఆడొద్దని మందలించింది. దీంతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారిని మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని మృతుడి తండ్రి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పట్టణ ఎస్ఐ కేసు నమోదు చేశారు.

యువతిని వేధించిన యువకుడిపై..

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణానికి చెందిన యువతిని అసభ్యకరంగా సోషల్‌మీడియా వేదికగా వేధించిన ఖమ్మం జిల్లా వైరా మండలానికి చెందిన యువకుడు రాహుల్‌పై ఆదివారం కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన ఓ యువతి సుజాతనగర్ మండలంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుకుంది. ఆ సమయాన ఖమ్మం జిల్లా వైరా మండలం విప్పలమడుగు గ్రామానికి బి.రాహుల్‌తో పరిచయం ఏర్పడి అతడి వద్ద కొంత డబ్బులు అప్పుగా తీసుకుంది. తిరిగి కొంత కాలానికి డబ్బులు తిరిగి ఇచ్చినా ఇవ్వలేదని చెప్పి తనతో శారీరకంగా దగ్గర కావాలని వేధింపులకు గురి చేశాడని ఆమె తన తల్లిదండ్రులకు తెలిపింది. దీంతో తల్లిదండ్రులు, బంధువులు విషయాన్ని యువకుడి తల్లిదండ్రులకు చెప్పి మళ్లీ అమ్మాయి జోలికి రావొద్దని మందలించారు. అయినా సదరు యువతి స్నేహితుల ద్వారా సోషల్ మీడియాలో యువతి పేరుతో నకిలీ ఇన్‌స్టాగాం అకౌంట్ క్రియేట్ చేసి ఆమె బంధువులు, స్నేహితులను ఫాలో అవుతున్నట్లు అసభ్యపద జాలంతో ఆమె క్యారెక్టర్‌ను కించపరిచేలా పోస్టులు పెట్టినట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ విషయమై యువతితో పాటు ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మహిళపై అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిపై..

పాల్వంచరూరల్: మిర్చి పరదాల విషయంలో తలెత్తిన వివాదంలో మహిళను చంపుతానని బెదిరించి అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధి నాగారం గ్రామానికి చెందిన ఆరేపల్లి ప్రమీల, జలగం అనిల్ పక్కనే మిర్చి పంట కల్లాలు చేసుకున్నారు. పంటపై రక్షణ కప్పే పరదాల విషయంలో శనివారం ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అనిల్ తనను చంపుతానని, రాళ్లతో కొట్టడానికి వచ్చాడని అసభ్యకరంగా ప్రవర్తించాడని బాధితురాలు ప్రమీల ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ కృష్ణ తెలిపారు.

ధాన్యం.. దైన్యం!



మల్లెలమడుగులో తడిసిన ధాన్యం వద్ద జంపయ్య

ఆదివారం రాత్రి ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షానికి రైతుల ధాన్యం తడిసిపోయింది. తుమ్మలచెరువు ఆయకట్టు కింద మొండికుంట, మల్లెలమడుగు, రామచంద్రాపురం, బీజీకొత్తూరు ధాన్యం కొనుగోలు కేంద్రాలు, పలు గ్రామాల్లో ధాన్యం తడిసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం శాతం వచ్చినా కాంటాలు వేయడం లేదని, వెంటనే పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి కాంటాలు వేసేలా పెట్టేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈనేపథ్యాన మొండికుంట గ్రామానికి చెందిన రైతు పగిడిపల్లి జంపయ్య 10 ఎకరాల ధాన్యాన్ని మల్లెలమడుగు కేంద్రానికి తీసుకొచ్చి ఆరబెట్టగా వర్షానికి పూర్తిగా తడిసిపోయింది.

– అశ్వాపురం

కోతుల సమస్యకు చెక్..!



బంధించిన కోతులతో సద్దాం

మండలకేంద్రం చంద్రుగొండలో నెలకొన్న కోతుల సమస్యపై 'సాక్షి'దినపత్రికలో కథనాలు ప్రచురితమవగా.. స్థానిక యువకుడు ఎస్‌డీ సద్దాం(చోటు) స్పందించాడు. తన సొంత ఖర్చులు రూ.80 వేలతో బోన్‌లు తయారు చేయించి గ్రామంలోని వీధుల్లో అమర్చి కోతుల్ని పట్టేస్తున్నాడు. మూడు రోజుల కాలంలో సుమారు 300 కోతులను బంధించి అటవీప్రాంతానికి తరలించి వదిలేస్తున్నాడు. ఈనేపథ్యాన ఆ యువకుడికి ఆర్థిక సాయం అందించేందుకు గ్రామస్తులు స్వతహాగా ముందుకొస్తున్నారు.

– చంద్రుగొండ

జల పుష్పాల వేట..!



పట్టిన చేపలను చూపుతున్న వేటగాడు

వేసవి తీవ్రతకు చెరువుల్లో నీరు అడుగంటిపోతుండడంతో ప్రజలు జల పుష్పాల వేటలో నిమగ్నమవుతున్నారు. తాజాగా కరకగూడెం మండలంలోని పద్మాపురం బుగ్గ చెరువులో ఆదివారం చిన్నాపెద్ద తేడా లేకుండా అందరూ ఉత్సాహంగా చేపల వేట నిమగ్నమయ్యారు. కొందరు వలలు వేస్తే, మరికొందరు చేతులతోనే చేపలను పట్టుకునే ప్రయత్నం చేశారు. ఇతర గ్రామస్తులు కూడా చేపలు పట్టేందుకు రావడంతో సందడి వాతావరణం నెలకొంది. ఈ దృశ్యాలను 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

– కరకగూడెం



చేపల వేటలో నిమగ్నమైన ప్రజలు

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తికి తీవ్ర గాయాలు



ట్రాక్టర్ బోల్తా పడిన దృశ్యం

కరకగూడెం: ట్రాక్టర్ బోల్తా పడి ఓ వ్యక్తి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కొలూరు గ్రామానికి చెందిన మలకం రమేష్ ఆదివారం తన ట్రాక్టర్‌తో పని నిమిత్తం చిరుమళ్ల గ్రామం వచ్చి తిరిగి వెళ్తున్నాడు. ఈక్రమంలో చిరుమళ్ల ఎస్సీ కాలనీ మూలమలుపు వద్దకు రాగానే ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పల్టీ కొట్టి పక్కనే ఉన్న పొలంలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రమేష్‌పై ట్రాక్టర్ పడగా.. కొందరు యువకులు గమనించి ట్రాక్టర్‌ను పక్కకు జరిపారు. అనంతరం 108లో అతడిని కరకగూడెం పీహెచ్‌సీకి ఆపై మణుగూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.